క్లుప్తంగా

తోవి ఎస్‌ఎంసీ ఎన్నిక పూర్తి



పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల పరిధిలోని తోవి గ్రామంలో పాఠశాల ఎస్‌ఎంసీ ఎన్నిక మంగళవారం పూర్తి అయ్యింది. ఎస్‌ఐ మహమ్మద్ రియాజ్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య ఎన్నిక నిర్వహించారు. ఎంఈఓ శోభరాణి ఉదయం నుంచి 12 గంటల వరకు టోకన్ల పద్ధతిలో ఎన్నికలు నిర్వహించారు. ఇందులో లక్ష్మన్న ఎస్‌ఎంసీ చైర్మన్‌గా ఎన్నికయ్యాడు. తహసీల్దారు మల్లికార్జున స్వామి, ఎంపీడీఓ సుబ్బారాజు పర్యవేక్షించారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు పోరాడాలి



మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహానంది

ఆదోని టౌన్: ఏబీసీడీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా మాలలందరూ ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని మాల మహానాడు సంఘం జిల్లా అధ్యక్షుడు మహానంది, సాయిరాం పిలుపునిచ్చారు. మంగళవారం ఆదోని పట్టణంలోని బైపాస్ ఆవరణలో మాల మహానాడు పట్టణ కార్యదర్శి బొబ్బిలి అధ్యతన మాలల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దళితుల ఐక్యతను దెబ్బ తీసేవిధంగా ఆగస్టు 1వ తేదీన సుప్రీంకోర్టు తీర్పు దళితుల మధ్యన చిచ్చుపెట్టే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో చాగి లింగప్ప, వెంకటరాముడు, భరత్, లింగంపల్లి మల్లికార్జున, ప్రహ్లాద, హనుమంతు, గిరిమల్లప్ప, చిగిళి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోసిగి: మండలంలోని దుద్ది – కొల్మాన్‌పేట గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బోయ నరసింహులు(50) రాయచూర్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందినట్లు కోసిగి ఏఎస్‌ఐ ఓబులేష్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా ఉంద్రాలపేట గ్రామానికి చెందిన బోయ నరసింహులు ఈనెల 19న ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనానికి వచ్చి బైక్‌పై తిరిగి వెళ్తుండగా ఎదురుగా మరో బైక్ ఢీకొనడంతో తలకు తగిలి తీవ్రగాయాలయ్యాయన్నారు. భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అక్కడే పోస్టుమార్టం చేయించినట్లు ఏఎస్‌ఐ వెల్లడించారు.

పట్టణ పారిశుద్ధ్యానికి సహకరించండి



గాంధీనగర్‌లో పూడిక తీత పనులు చేపడుతున్న సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణ ప్రజలు పారిశుద్ధ్యానికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు. మంగళవారం గాంధీ నగర్‌లోని డ్రైనేజీలో పూడిక తీత పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించడం తగదని సిబ్బందిని హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాలువల్లో చెత్తను పారబోయకుండా పారిశుద్ధ్య కార్మికులకు ఇచ్చి సహకరించాలని ప్రజలను కోరారు.

సీసీరోడ్డు నిర్మించండి

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలో దుర్గమ్మ గుడి వెనుక సీసీ రోడ్డు నిర్మించాలని అఖిలభారత రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి సత్యం, ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి బాలరాజు కోరారు.మంగళవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో ఎంపీడీఓ బంగారమ్మకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేపట్టి వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఇవ్వాలన్నారు.

నేటి నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

ఆదోని సెంట్రల్: ఫార్మేటివ్ అసిస్‌మెంట్ పరీక్షలను సెల్ఫ్ అసిస్‌మెంట్ పరీక్షలుగా పేరు మార్చి పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఉప విద్యాధికారి వెంకటరమణా రెడ్డి మంగళవారం తెలిపారు. మనకు ఒరియంటల్ కోర్సులు లేవు కనుక సబ్జెక్టులు వారీగా బుధవారం నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఎస్‌ఏ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 1 నుంచి 5వ తరగతి వరకు ఉదయం 10.45 నుంచి 11.45 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. 28న తెలుగు, 30న ఇంగ్లిషు, 31న మ్యాథమెటిక్స్, సెప్టెంబర్ 2న ఎన్విరాన్‌మెంటల్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. 6 నుంచి 8వ తరగతికి మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు పరీక్షలను క్లాస్ బేస్ట్ అసిస్‌మెంట్ ఓఎంఆర్ పద్ధతిలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. 9, 10 తరగతులకు ఉదయం 11 నుంచి 12 గంటలు వరకు పరీక్షలు రెగ్యూలర్ పద్ధతిలో జరుగుతాయని చెప్పారు. 28న తెలుగు, 30న హిందీ, 31న ఇంగ్లిషు, సెప్టెంబర్ 2న మ్యాథమెటిక్స్, 3న జనరల్ సైన్స్, 4న సోషల్ స్టడీస్ పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు.

మహిళా డాక్టర్ల రక్షణకు చట్టం తేవాలి



ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే మహిళా డాక్టర్లు, సిబ్బంది కోసం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా చట్టం తీసుకురావాలి. జడ్జీలు, పోలీసులకు రక్షణ ఉంటుంది. అదే మాదిరిగా మహిళా డాక్టర్లకు రక్షణ అవసరం. భద్రత కోసం ప్రత్యేకంగా చట్టం చేయాలి. వెంటనే రక్షణ అమలు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా డాక్టర్లకు భద్రత లేకుండా పోతుంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాత్రివేళల్లో డ్యూటీలు చేసేందుకు కూడా మహిళా డాక్టర్లు ముందుకు రారు.

– డాక్టర్ టి.జగదీష్‌కుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఆర్‌ఎంఓ, ఆదోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి



భద్రతా చర్యలు తీసుకోవాలి



వైద్యులకు భద్రతను పెంచే రక్షణ చట్టాలను తీసుకురావాలి. వైద్యులు పనిచేసే చోట భద్రత కల్పిస్తే ఒత్తిడి లేకుండా వైద్యం చేయగలం. వైద్యం కోసం వచ్చేవారి సేవ చేయాలనే ఆలోచన ఉంటుందే తప్ప నిర్లక్ష్యం చేయాలని ఎవరికీ ఉండదు. కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలుపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి, అప్పుడే ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చట్టాలను తీసుకురావాలి. – డాక్టర్ చిరంజీవి, కంటి వైద్య నిపుణులు, ప్రభుత్వాసుపత్రి, ఎమ్మిగనూరు

నిద్దరోతున్న నిఘా

- ఎమ్మిగనూరు పట్టణంలో 32 సీసీ కెమెరాల ఏర్పాటు
- ప్రధాన కూడళ్లల్లో పనిచేయని వైనం
- మరమ్మతులకు నోచుకోని సీసీ కెమెరాలు
- బస్టాండ్‌లో కెమెరాలు, మానిటరింగ్ విజయవాడలో

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శాంతి భద్రతలతో పాటు ప్రజల రక్షణ, ట్రాఫిక్ సమస్యలపై నిఘా ఉంచేందుకు సీసీ కెమోరాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రస్తుతం పట్టణంలో నిఘా నేత్రం నిద్రపోతున్నట్లు ఉంది. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పట్టణ ప్రజల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది.

పట్టణ నలుమూలలా సీసీ కెమెరాలు..

పట్టణంలో లక్షా 20 వేలకు పైగా జనాభా ఉన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పోలీసులు పట్టణంలోని ప్రధాన కూడళ్లు, బైపాస్‌తో పాటు పట్టణ నలువైపులా 32 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే ప్రధాన కూడళ్లలో అవి పనిచేయకపోవటంతో ప్రజలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి మంత్రాలయం, ఉరుకుంద దేవస్థానాలు, కర్నూలు, ఆదోనిలకు ప్రయాణికులు అధిక సంఖ్యలో వెళ్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ బస్టాండ్‌లో సీసీ కెమెరాలు ఉన్నా విజయవాడలో మానిటరింగ్ ఉండటంతో దొంగతనం జరిగినా పసిగట్టే అవకాశం లేదు. దీంతో దొంగలు తమ పని సులవుగా కానిచ్చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో చిల్లర దొంగతనాలు ఎక్కువైనట్లు తెలుస్తోంది. ప్రయాణికుల్లా దొంగలు ఉంటూ, బస్సు ఎక్కేటప్పుటు చోరీలకు పాల్పడుతున్నారు. పట్టణ పోలీసులు ఆర్టీసీ బస్టాండ్ సీసీ కెమెరాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



శివ సర్కిల్‌లో పనిచేయని సీసీ కెమెరాలు



ఆర్టీసీ బస్టాండ్‌లో పనిచేయని కెమెరాలు

దుండగుల పరారీకి అనుకూలం..

పట్టణంలోని ప్రధాన కూడలైన సోమప్ప సర్కిల్లోని సీసీ కెమెరా పనిచేస్తున్నా రికార్డింగ్ లేదు. శివ సర్కిల్, ఆదోని రోడ్ వై జంక్షన్, కర్నూలు, గూడురు బైపాస్ రోడ్డు, మార్కెట్ యార్డ్ రోడ్డు, మంత్రాలయం, కోసిగి రోడ్డు, శ్రీనివాస, సోమేశ్వర, ఓంశాంతి సర్కిల్స్, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు సీసీ కెమెరాలు వివిధ కారణాల చేత పనిచేయటం లేదు. దీంతో దొంగతనాలు, ప్రమాదాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారు సులభంగా తప్పించుకొని ప్రధాన కూడళ్లను దాటుకొని పరార్ అవుతున్నారు. అదే కెమెరాలు పనిచేసినట్లయితే సీసీ కెమెరాలో నమోదైన రికార్డును బట్టి నిందితులు, అనుమానితులను పట్టుకునేందుకు సులభంగా ఉండేది. వీటితో పాటు పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది, ఆటోలను ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్నారు. గతంలో సీసీ కెమెరాలు పనిచేస్తునప్పుడు పోలీస్‌స్టేషన్లో కెమెరాల్లో చూసి కానిస్టేబుల్ ట్రాఫిక్ సమస్యను నివారించేవారు. పట్టణ పోలీసులు స్పందించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించి నిఘా కన్ను తెరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతు చేయిస్తాం



పట్టణంలో పనిచేయని సీసీ కెమెరాలకు త్వరలో మరమ్మతులు చేయిస్తాం. కెమెరాలు అమర్చినచోట సాంకేతిక సమస్యల వలన పనిచేయటం లేదు. కొన్ని చోట్ల వైర్లు తెగిపోయినట్లు మా దృష్టికి వచ్చింది ఎక్కడెక్కడ ఏ సమస్య ఉందో తెలుసుకొని మరమ్మతులు చేయించేందుకు జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నాం. కొన్ని పనిచేస్తునాయి, మొత్తం కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– సుదర్శన్‌రెడ్డి, సీఐ, ఎమ్మిగనూరు టౌన్

రైతులను మోసం చేస్తే లైసెన్స్ రద్దు

సాక్షి ఎఫెక్ట్

ఆదోని అర్బన్: రైతులను మోసం చేస్తే వారి లైసెన్సులను రద్దు చేస్తామని మార్కెట్‌యార్డు అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ కమీషన్ ఏజెంట్లను హెచ్చరించారు. మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్ల దోపిడీపై సోమవారం సాక్షి దినపత్రికలో 'మార్కెట్‌యార్డులో దోపిడీ' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి.. యార్డులోని కమీషన్ ఏజెంట్ల దుకాణాలను తనిఖీ చేశారు. అదేవిధంగా వారివద్ద నుంచి రైతుల తక్ పట్టీ పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. రైతుల తక్ పట్టీల్లో ధరల తేడా, నిబంధనలను అతిక్రమించి కూలీలు వేసిన వాటిని పరిశీలించడానికి తీసుకెళ్లారు. అదేవిధంగా రైతులకు అవగాహన కల్పించారు. తక్‌పట్టీలో కూలీల ధరలను ఎక్కువగానీ, ధరలో తేడా వచ్చినట్లు అనుమానం వస్తే వెంటనే కార్యాలయానికి వచ్చి అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ఆదోని సెంట్రల్: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఏకీకృత పెన్షన్‌కు బదులు పాత పెన్షన్ విదానాన్నే అమలు చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సి.నాగరాజు తెలిపారు. నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ఎస్టీయూ లోక్య నాయక్ అధ్యక్షతన భోజనం విరామం సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌ను తెరపైకి తెచ్చి ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. ఓపీఎస్ కింద 20 సంవత్సరాలు సర్వీసు ఉన్న వారికి పూర్తి పెన్షన్ వచ్చేదన్నారు. ఇప్పుడు యూపీఎస్‌లో ఉద్యోగుల భాగస్వామ్య వాటా ఎందుకని వారు ప్రశ్నించారు. యూపీఎస్ వద్దు ఓపీఎస్‌నే అమలు చేయాలన్నారు. ఎస్టీయూ పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు, పట్టణ అధ్యక్షులు రవి, నాయకులు రాజాసతీష్, ప్రసాద్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న ఆదోని ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ సి.విశ్వనాథ్

ఆదోని టౌన్: గణేష్ ఉత్సవాలను విజయవంతంగా చేపట్టాలని ఆదోని ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ సి.విశ్వనాథ్ సూచించారు. మంగళవారం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో ఆదోని డివిజన్ స్థాయి అధికారులతో, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో ఉత్సవాల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 7వ తేదీన జరిగే వినాయక చవితి పండగ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యంగా ఆదోని పట్టణంలో 11వ తేదీన జరిగే నిమజ్జనం కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. మౌలిక సదుపాయాలైన తాగునీరు, విద్యుత్, లైటింగ్, శానిటేషన్, ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నిమజ్జనానికి గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో క్రేన్లు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే గజ ఈతగాళ్ల ఏర్పాటు చేయాలని ఫిషరీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సిసిరాదీప్తి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గంటా సుబ్బారావు, డిప్యూటీ తహసీల్దార్ రుద్రగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



వేముగోడులో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత

గోనెగండ్ల : ఖరీఫ్ సీజన్ 2024 సంవత్సరానికి సంబంధించి సాగుచేసిన ప్రతి రైతు తప్పకుండా పంట నమోదు చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏఓ హేమలత తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తిప్పనూరు, వేముగోడు, పుట్టపాశం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రలను సందర్శించారు. అనంతరం ఆ గ్రామాల్లో సాగుచేసిన వేరుశనగ, పత్తి, వరి తదితర పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ సాగుచేసిన పంటలు నమోదు చేసుకోవడం వలన రైతులకు పంట నష్టం పరిహారం, క్రాప్ ఇన్స్‌రెన్స్, ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలిపారు. అలాగే వేముగోడు గ్రామంలో వైష్ణవి ట్రేడర్స్ ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసిన మందులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ఎమ్మార్పీ కంటే ఎక్కువ అమ్మకూడదని, స్టాక్ బోర్డు ప్రతి రోజు అప్డేట్ చేయాలని ఫర్టిలైజర్ షాపుల యాజమానులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సత్తార్, లక్ష్మన్న, ఉద్యానవన సహాయకులు జాకీర్, రైతులు పాల్గొన్నారు.

ఎస్టీ రిజర్వేషన్ సాధనకు పోరాడుదాం



నినాదాలు చేస్తున్న వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌భీంనాయుడు

ఆదోని రూరల్: వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ సాధించే అంశంపై పోరాడడానికి ప్రతి వాల్మీకి బిడ్డ నడుంబిగించి ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌భీంనాయుడు అన్నారు. మంగళవారం ఆదోని పట్టణంలోని శ్రీ లక్ష్మమ్మవ్వ నగర్‌లో వాల్మీకి రంగన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రామ్‌భీంనాయుడు మాట్లాడుతూ గత 60 సంవత్సరాల నుంచి వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని అనేక ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కేవలం ఎలక్షన్ల సమయంలో మాత్రమే హామీలు ఇస్తున్నారే తప్పా ఇప్పటి వరకు జరిగింది శూన్యమన్నారు. కాబట్టి మనమందరం కలిసికట్టుగా పార్టీలకు అతీతంగా మన పిల్లల జీవితాల కోసం త్యాగాలు చేయడానికి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వీరాంజనేయులు, విజయ్, రంగ, రమేష్, రాము, సుబ్బు తదితరులు పాల్గొన్నారు.



శ్రీమఠం ప్రాంగణంలో ఉట్టి కొడుతున్న యువకుడు

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

మంత్రాలయం : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో గోకులాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆశీస్సులతో వేడుకలు జరుపుకున్నారు. శ్రీమఠం ప్రాంగణంలో ఉట్టి కొట్టు కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఎంతో కమనీయంగా వేడుక సాగింది. కార్యక్రమంలో బాలానగర్‌లోని అక్షోభ్య మఠం ఉప పీఠాధిపతి అక్షోభ్య రామప్రియ తీర్థులు, మేనేజర్ శ్రీనివాసరావు, సంస్కృత విద్యాపీఠం ప్రధానాచార్యులు వాదిరాజాచార్ పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధుల విడుదల

గోనెగండ్ల : గ్రామ పంచాయతీల్లో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు రూ.90,12,211 మంజూరయ్యాయన్నారు. ఈ మొత్తం ఇప్పటికే పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయని చెప్పారు. ఆర్థిక సంఘం నిధులతో సర్పంచ్‌లు పంచాయతీ తీర్మానం మేరకు గ్రామంలో వివిధ అభివృద్ధి పనులు తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితర అవసరాలకు ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకోవాలన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాప్‌ను పునరుద్ధరించాలి



డీఆర్‌ఎంను కలిసి వినతి పత్రం అందజేస్తున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ

ఆదోని అర్బన్: ఆదోని, మద్దికెర స్టేషన్‌లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాప్‌ను పునరుద్ధరించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ కోరారు. నూతనంగా నియమితులైన గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.విజయ్‌కుమార్‌ను మంగళవారం గుంతకల్ రైల్వే నిలయంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో కలిశారు. పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. నీలకంఠ మాట్లాడుతూ మద్దికెర రైల్వేస్టేషన్ నుంచి వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కోవిడ్ ముందు స్టాప్ ఉండేదని, కోవిడ్ తర్వాత స్టాప్‌ను ఎత్తి వేశారన్నారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు గమ్యస్థానానికి చేరడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

ఎమ్మిగనూరుటౌన్: గ్రేడ్ వన్ మున్సిపాలిటీలో శివారు కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజల ఇబ్బందులు తొలగించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, నాయకులు భాస్కర్ యాదవ్, మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ కోరారు. మంగళవారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి ఇచ్చారు. శివారు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీరు తదితర వసతులు కల్పించాలన్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం

ఆదోని రూరల్: విద్యుత్ మీటర్ రీడర్స్ సమస్యలపై ఐక్యంగా పోరాడుదామని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక తిమ్మారెడ్డి బస్టాండు సమీపంలోని ఏఐటీయూసీ ఆటో భవనంలో విద్యుత్ మీటర్ రీడర్ల సర్వసభ్య సమావేశం నరసింహుడు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కర్ మాట్లాడారు. అనంతరం డివిజన్ ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, రాజు, కోశాధికారులుగా ముని, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మన్న, ఉపాధ్యక్షులుగా దశరథ్, జాయింట్ సెక్రటరీగా సుధాకర్, బద్రి తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం తమ సమస్యలపై ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌కు వినతి పత్రం అందజేశారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

కోసిగి: పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం మహాపుణ్య భాగ్యమని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మౌంట్ కార్మెల్ పాఠశాల ఆవరణలో కర్నూలు ఆర్‌ఆర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఫాదర్ జిజో, బాల ఏసు ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే వైద్య శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నరాలకు సంబంధించిన తెలుగు రాష్ట్రాల్లో పేరుపొందిన ఆర్‌ఆర్ హాస్పిటల్ డాక్టర్లు రోహిత్, రాహుల్, రాఘవేంద్రరావులు కలిసి జిల్లాలోని మారుమూల వెనుకబడిన ప్రాంతంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, పేదలకు ఉచిత వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. అవసరమైన ఆపరేషన్ ఉచితంగా చేయించడం పుణ్యభాగ్యమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిరుపేదలకు కార్పోరేట్ తరహా ఉచిత వైద్య సేవలు అందించి పేదల ప్రాణాలను కాపాడడం కోసం ఉచిత ఆరోగ్య శ్రీ పథకం శ్రీకారం చుట్టిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందన్నారు. గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం కొనసాగించి నిరుపేదలకు రూ.25లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు కృష్ణారెడ్డి, ఎంపీపీ ఈరన్న, వైఎస్సార్ సీపీ నాయకులు నాడుగేని నరసింహులు, బెట్టన గౌడ, మహంతేష్ స్వామి, నాడుగేని నాగరాజు, షంషుద్దీన్, మంగమ్మ, భీమక్క తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించరాదు



మాట్లాడుతున్న సీఎస్ఐ రాయలసీమ బిషప్ వరప్రసాద్

కోసిగి: బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, చర్చీల్లో సంఘ పెద్దలు అప్రమత్తంగా ఉండాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని సీఎస్ఐ రాయలసీమ అధ్యక్ష మండలం బిషప్ రెవరెండ్ ఐజెక్ వరప్రసాద్ సూచించారు. మంగళవారం కోసిగిలో సీఐఎస్ క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో సంఘం రాయలసీమ సెక్రెటరీ రెవరెండ్ సాల్‌మోన్ అధ్యక్షతన సంఘ పెద్దలతో బిషప్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా స్థానిక నాడుగేని వీధి నుంచి సీఎస్ఐ వర్చి వరకు భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించి, బిషప్‌కు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ చర్చీలలో వివాహాలు జరిపే సంఘం పెద్దలు అమ్మాయిలకు 18, అబ్బాయిలకు 21 సంవత్సరాలు ఆధార్ కార్డుల ఆధారంగా పరిశీలించి పెళ్లిళ్ల చేయాలన్నారు. డయాసిస్ నియమ నిబంధనల ప్రకారమే ముందుకు సాగుతూ సంఘం బలోపేతంకు కృషి చేయాలన్నారు. ప్రతి క్రిష్టియన్ ప్రతి రోజు చర్చిలలో ప్రార్థనలు చేసుకుని క్రీస్తు చూపిన మంచి మార్గంలో నడుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమానికి మంత్రాలయం, కోసిగి, కౌతాళం, పెద్దకడబూరు మండలాలలోని వివిధ గ్రామాల్లో సీఎస్ఐ సంఘం పెద్దలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ అధ్యక్ష, మండలం అధికారులు కార్యదర్శి మేరి కుమార్, డివిజనల్ చైర్మన్లు చినబాబు, చిన్న పురుషోత్తం, దేవదానం, ముత్తు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.కె.రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: పత్తి సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. కె.రాఘవేంద్రచౌదరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణపై కేవీకే-ఎల్డీసీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడి కోసం అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసే మంచి దిగబడులు సాధించవచ్చని చెప్పారు. ఈ పద్ధతిలో ప్రత్తి ఏపుగా పెరగకుండా మొదట ఏర్పడిన కాయలను నిలుపుకోవటానికి 'మెపిక్వాట్ క్లోరైడ్' అనే మందును మొక్కల పెరుగుదల నియంత్రణకు ఉపయోగించాలన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు వచ్చే అవకాశం ఉందని, రైతులు విత్తిన 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగులను గమనిస్తూ ఉండాలన్నారు. పురుగును గుర్తిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మొదటిగా 150 మందికి ఉచితంగా లింగాకర్షణ బుట్టలను పంపిణీ చేయటం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా.మౌనిక, డా.చందన, డా.విష్ణువర్ధన్‌రెడ్డి, రవీంద్ర, ఎల్డీసీ కంపెనీ ప్రతినిధి రాఘవరెడ్డి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రాప్లింగ్ రెజ్లింగ్‌లో పతకాలు



మెడల్స్ సాధించిన విద్యార్థినులతో తహసీల్దార్ నజ్మాబాను

హాలహర్వి: స్థానిక కస్తూర్బా విద్యాలయానికి చెందిన ఏడుగురు విద్యార్థినులు ఈనెల 25, 26వ తేదీల్లో రేణిగుంటలో జరిగిన రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ (కుస్తీ పోటీలు) పోటీల్లో పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పాఠశాలలో విద్యార్థినులను తహసీల్దార్ నజ్మాబాను, సీనియర్ అసిస్టెంట్ సుశీలమ్మ అభినందించి మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. తహసీల్దార్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీల్లో జి.లక్ష్మి, ఇందు, శబరి, మాబిని, ఎం.లక్ష్మి, సుకన్య, అరుణలు 2 బంగారు పతకాలు, 2 సిల్వర్ పతకాలు, 3 బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. వీరు అక్టోబర్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.